పంట వ్యర్థాలతో ప్రయోజనం

మానవపాడు: పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా వాతావరణం కాలుష్యం అవుతుందని, వాటిని కుళ్లేలా చేస్తే భూమిలో సారం పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం వ్యవసాయశాఖ రాష్ట్ర మంత్రితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి కొనుగోలుకు సంబంధించి బోనస్ ద్వారా రైతులకు రూ. 500 వచ్చాయా? లేదా అనే అడిగారని వివరించారు.

అయిజ: పంటకాలం పూర్తయిన అనంతరం పంట వ్యర్థాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జనార్దన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులు 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి రైతులకు పలు సూచనలు చేశారు. వరి కోతలు పూర్తయిన తర్వాత వరి కొయ్యలను కుల్లింపజేయాలని, దానికోసం ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ పాస్పేట్‌తో పాటు 15 కిలోల యూరియాను వరి కొయ్యలపై చల్లాలని సూచించారు. నీటి తడిని పెట్టడం ద్వారా త్వరగా డీకంపోజ్ అవుతుందన్నారు. రోటవేటర్ ద్వారా కలియదున్ని భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు.


కేటీదొడ్డి శివారులోని రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ ప్రీతిసుధ

వరికొయ్యలు కాల్చొద్దు

కేటీదొడ్డి: వరికొయ్యలు కాలిస్తే వాతావరణ కాలుష్యం పెరిగి, భూసారం కోల్పోతుందని ఏఓ సాజిద్ రెహమాన్, ఏఈఓ ప్రీతిసుధ అన్నారు. మండల వ్యాప్తంగా వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. వరికొయ్యలు కలియ దున్నటంతో భూ సారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కొయ్యలు కాల్చితే భూమిలో ఉండే మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు నశిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రైతులు కొండన్న, వీరన్న తదితరులు ఉన్నారు.

గట్టు: వరి కొయ్యలను రైతులు తగులబెట్టరాదని, అలా చేయడం ద్వారా వాయు కాలుష్యంతో పాటు భూమిలోని పోషకాలను కోల్పోవాల్సి వస్తోందని వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి తెలిపారు. మంగళవారం గొర్లఖాన్‌దొడ్డి గ్రామ శివారులో వరి కొయ్యల అవశేషాలను కుళ్లింప చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు.


గొర్లఖాన్‌దొడ్డిలో..


అయిజలో..

విద్యార్థులకు ప్రతిభా పోటీలు



అలంపూర్: జిల్లా ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో బాలోత్సవం పిల్లల పండుగ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల న్యూప్లాట్లలో 56 మంది విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను ఎంఈఓ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ఆలోచన విధానాన్ని పెంచేందుకు ప్రతిభా పోటీలు దోహదం చేస్తాయన్నారు. ఈ నెల 20వ తేదీన వ్యాసరచన పోటీలు, 21న ఉపన్యాస పోటీలు, 22న పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు అక్బర్‌అలీ, ఆశన్న, ఉపాధ్యాయులు రాజారెడ్డి, చిన్న మద్దిలేటి, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైద్య పరీక్షలు



గట్టు: మండలంలోని తుమ్మలచెరువు, పెంచికలపాడు గ్రామాల్లో మంగళవారం భవిష్య భారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ టెస్టులు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫార్మాసిస్టు జిలాని, స్టాఫ్ నర్సు రాగిణి, హాలీంపాషా, ఆశా కార్యకర్తలు పద్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించండి



అయిజ: భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయ భవనం నిర్మించేందుకు పట్టణంలో స్థలం కేటాయించాలని ఆ సంఘం నాయకులు కోరారు. మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రకాషం, శ్రీను, నరసింహులు, ఆంజనేయులు, చిన్నన్న, లక్ష్మన్న, దుబ్బన్న, గంగన్న, జాన్, దావీద్, ముక్కెరన్న, యేసురత్నం, నక్కరాజు, తిమ్మప్ప, లక్ష్మన్న, ఎజ్రా తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు



మానవపాడు: ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, మందులు అమ్మాలని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని పలు దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వర ట్రేడర్స్, మన గ్రోమోర్, పీఏసీఎస్ మానవపాడు, జల్లాపురంలో సుగుణేశ్వర ట్రేడర్స్, శ్రీవిజయలక్ష్మి ట్రేడర్స్ షాపుల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఎరువులకు, ఫర్టిలైజర్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించామని తెలిపారు. ఎరువుల నిల్వలను పరిశీలించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ధరూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని చింతరేవుల తదితర గ్రామాల్లో మంగళవారం ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. రేవులపల్లి సెంటర్‌లో రైతులకు టోకెన్లు అందజేసినట్లు ఏఈఓ స్వరూప తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ప్రభాకర్‌గౌడ్, నర్సన్‌దొడ్డి కృష్ణారెడ్డి, ఈశ్వర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం తగదు

గద్వాల రూరల్: కొనుగోలు కేంద్రాల్లో కుప్పలు కుప్పలుగా నిల్వ ఉన్న వరిధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతాంగ సమితి జిల్లా అధ్యక్షుడు ఖాజామైనుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని అనంతపురంలో ఐకేపీ సెంటర్‌ను సందర్శించి మాట్లాడారు. సెంటర్లలో సరిపడ గోనే సంచులు అందుబాటులో ఉంచి ధాన్యాన్ని సేకరించి, రైతుల ఇబ్బందులు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో రైతాంగ సమితి నాయకులు రాధాకృష్ణారెడ్డి, గోపాల్ ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మల్దకల్: మోటారుసైకిల్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ మహిళ చికిత్స పొందుతూ మంగళవారం కర్నూల్‌లోని ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్ఐ నందికర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం గట్టు మండలంలోని పెంచికలపాడుకు చెందిన గోకారి తన మోటారు సైకిల్‌పై భార్య నర్సమ్మతో పాటు ఇద్దరు కుమారులతో బీచుపల్లి ఆలయానికి వెళ్లి వస్తుండగా.. మార్గమధ్యలో సద్దలోనిపల్లి గ్రామ స్టేజీ సమీపంలో శనివారం రాత్రి రోడ్డుపై ఏర్పడిన గుంతలను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఘటనలో భార్య నర్సమ్మ(29) తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భవానీమాత ఉత్సవాలు ప్రారంభం


భవానీ ఆలయంలో పందిరి పూజలు చేస్తున్న ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులు

గట్టు: మండల కేంద్రంలో కొలువుదీరిన అంబా భవాని మాత ఉత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా కార్తీక మాసంలో శ్రీఅంబాభవాని మాత ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే కార్తీక బహుళ పంచమి మంగళవారం పందిరి పూజతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఎస్ఎస్‌కే (క్షత్రియ సంఘం) సమాజ్ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ జాతరకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆకు పూజ నిర్వహించారు. ఉదయం 11 గంటలకు అమ్మవారి ఆలయం ఎదుట మామిడి ఆకులు, తోరణాలతో పందిరి వేసి పూజలు చేశారు. జాతర సందర్భంగా ఇప్పటికే సంత బజారులో మిఠాయి దుకాణాలు, చిన్న పిల్లల ఆట వస్తువుల విక్రయ దుకాణాలు వెలిశాయి. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు పెద్ద అంబుసా, సంఘం సభ్యులు పాపురం వెంకటేష్, సూపర్ పటేల్ వీరన్న, వినోద్, చంద్రమోహన్, లక్ష్మణ్, సురేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'డీఏపీకి బదులుగా నానో డీఏపీ వాడండి'

శాంతినగర్: ప్రస్తుతం అంతర్జాతీయ రాజకీయ పరిణామాల వల్ల డీఏపీ దిగుమతులు తగ్గిపోవడం వల్ల కొరత ఏర్పడిందని, అందుకు ప్రత్యామ్నాయంగా నానో డీఏపీ ఎరువులను వాడాలని వడ్డేపల్లి ఎంఏఓ రాధ సూచించారు. వడ్డేపల్లి మండల ఎరువుల డీలర్లు, ఏఈఓలు, రైతుల సమావేశం మండలంలోని కొంకల రైతువేదికలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఏఓ మాట్లాడుతూ దేశీయంగా ముడిసరుకు ధరలు పెరిగి ఉత్పత్తి తగ్గిపోవడంతో డీఏపీ కొరత ఏర్పడుతోందన్నారు. దీంతో డీఏపీ ఎరువులకు ప్రత్యామ్నాయంగా యాసంగి పంటలను నానో డీఏపీ, సూటి, కాంప్లెక్స్ ఎరువులు వాడాలని సూచించారు. మండలంలో యాసంగిలో మొక్కజొన్న అధికంగా సాగు చేస్తున్నందున మొక్కజొన్న పంటకు కావాల్సిన నత్రజని, భాస్వరం, పొటాషియం ఎరువుల గురించి రైతులకు ఎంఏఓ వివరించారు.


నానో డీఏపీ గురించి అవగాహన కల్పిస్తున్న ఎంఏఓ రాధ

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

అమరచింత: గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ఎన్నో విధాలుగా ఉపయోగపడుతాయని ఎస్ఐ సురేష్ తెలిపారు. మండలంలోని కిష్టంపల్లిలో మంగళవారం సీసీ కెమెరాల ఏర్పాటు గురించి ప్రజలతో పాటు ఆయా రాజకీయ పార్టీల నాయకులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సీసీ కెమెరాలు గ్రామంలోని నలు మూలల ఉంటే రాత్రి వేళల్లో అపరచిత వ్యక్తుల వల్ల కలిగే అనర్థాలను గుర్తించడమే కాకుండా చోరీలు, నేరాలు నియంత్రించే అవకాశం ఉందన్నారు. పదిహేను రోజుల కిందట గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ పరిసరాల్లో నవజాత శిశువును ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారని, సీసీ కెమెరాలు ఉంటే వారెవరో గుర్తించే అవకాశం ఉండేదన్నారు. గ్రామ ప్రజలు సమిష్టిగా సీసీ కెమెరాలను ఏర్పాటుకు సహకరించాలని కోరారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తర్వాత వాటిని పోలీస్ స్టేషన్ నుంచే మానిటరింగ్ చేస్తూ నేరాలు జరగకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కురుమన్న, మల్లారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సురేష్

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి జాతరలో మంగళవారం అధికారులు పారిశుద్ధ్యం పనులు ముమ్మరంగా చేపట్టారు. స్వామి వారి ఆలయ పరిసరాలతో పాటు జాతర మైదానంలోని కోనేరు, అన్నదాన సత్రాలు, స్వీట్లు, గాజుల దుకాణాలు పరిసరాల్లో పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. ఎప్పటికప్పుడు చెత్తచెదారం లేకుండా చూస్తున్నారు. అక్కడక్కడ బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపన పూజలు


ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

ఆత్మకూర్: మండలంలోని బాలకిష్టాపూర్ గ్రామ శివారులోని శ్రీఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో కోదండరామస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు రెండో రోజు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఉదయం ప్రాతకాలపూజ, యంత్రాభిశేకం, జపాలు, హోమం, విగ్రహాల గ్రామోత్సవం, మహాన్నపనం, ధాన్యాధివాసం, శయ్యాధివాసం, మంగళహారతి, వేదస్వస్తి, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురారోపణ, మూలమంత్ర జపాలు, దీక్షా హోమం, జలాధివాసం, మహామంగళహారతి, వేద స్వస్తి, తీర్థప్రసాద వినియోగం తదితర పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం....

బుధవారం ఉదయం 10గంటలకు సీతారాములవారు, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని, భక్తులు వేలాదిగా తరలిరావాలని నిర్వాహకులు కోరారు. అంతకంటే ముందు ప్రాతకాల పూజ, గర్తన్యాసం, యంత్ర ప్రతిష్ఠ, కుష్మాండబలి, చక్షాగ్నిజ్వాల, బలిదానం, మహాపూర్ణహుతి, కలశోధ్యాసన, కలశజలమార్జన, ఆశీర్వచనం తదితర పూజ కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. పూజల్లో గాడి లక్ష్మీనారాయణ, అరుణ, మాజీసర్పంచులు సత్యన్న, తుకరాంనాయక్, నిర్వాహకులు మాసన్న, చిరంజీవి, గాగ్యనాయక్, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



మల్దకల్: ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల వివరాలతో పాటు పాఠశాలకు సంబంధించిన పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మల్దకల్ ఎమ్మార్సీలో ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు నిర్దేశించిన సమయంలో పరీక్షలు నిర్వహించాలని, పాఠశాల గ్రేడింగ్ విషయంలో అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు వెంకటేష్, పద్మావతి, పరమన్న, బాలగౌడ్, విజయ్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయికి ఘన నివాళి



సాక్షి, నెట్‌వర్క్: స్వాతంత్య్ర పోరాటంలో తెల్లదొరల పాలిట సింహ స్వప్నంగా నిలిచి పోరాడిన వీర వనిత ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శేఖర్, గోపాల్, అంజి, ఓబులేష్, దామోదర్, రఘు, భగత్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, వీరేష్, రాము, నరసింహులు, ఆంజనేయులు, వెంకటేష్, భీమేష్ పాల్గొన్నారు.

'ప్రజాపాలన' విజయాలపై కళాజాతా

అమరచింత: ప్రజా ప్రభుత్వంలో ప్రజాపాలనలో ప్రజలకు ఏడాదిలో వర్తింపచేసిన పథకాల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రజావిజయోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమం సందర్భంగా కళాకారులతో కలిసి ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈనెల 19 నుంచి డిసెంబర్ 7 వరకు కళాజాతా ద్వార ప్రభుత్వం ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్, తెలంగాణ సాంస్కృతిక సారధి ఆర్గనైజర్ శివలింగం, రాధ, శ్రీదేవి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

ఆత్మకూర్: కళాశాలలు, పాఠశాలల్లో సీనియర్లు జూనియర్లపై ర్యాగింగ్‌కు పాల్పడితే తెలంగాణ ర్యాగింగ్ ప్రొహిబిషన్ యాక్టు 1197 ప్రకారం చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ అన్నారు. మంగళవారం స్థానిక వికాస్ కళాశాలలో ర్యాగింగ్ నిర్మూలన అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తోటి విద్యార్థులను ర్యాగింగ్ పేరిట అవమానాలకు గురిచేసిన, దాడులకు పాల్పడిన, ఆత్మహత్యలకు ప్రేరేపించిన, నిర్బంధాలకు గురిచేసిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఇంటర్‌నెట్ వినియోగం పెరిగిన తర్వాత సైబర్ నేరాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అపరచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్‌కు వ్యక్తిగత ఓటీపీలు, బ్యాంకు వివరాలు, చెప్పొద్దని సూచించారు.



ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి


శివరంగాపురంలో హాజరు రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ


పాల్వాయిలో..

ఎర్రవల్లి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించి పాఠశాలకు విధిగా హాజరు కావాలని మండల విద్యాధికారి అమీర్‌పాష అన్నారు. మంగళవారం మండలంలోని దువాసిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులతో ముచ్చటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారంతో పాటు ఉన్నతమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయ్‌భాస్కర్, ఉపాధ్యాయులు ఆర్థర్, బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో..

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించి వారి విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ సూచించారు. మంగళవారం మండలంలోని పాల్వాయి పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రార్థనా సమయానికే పాఠశాలకు రావాలన్నారు. సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేటీదొడ్డి: విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి వెంకటేశ్వర్‌రావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని శివరంగాపురం, గంగన్‌పల్లి పాఠశాలల్లో ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీ యుగంధర్, పాపయ్య తదితరులు ఉన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

ఎర్రవల్లి: మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేయనున్న రక్తదాన శిబిరానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి


గద్వాలలో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గద్వాల అర్బన్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం కాంగ్రెస్ నాయకులు జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్‌లోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో శంకర్, మధుసూదన్‌బాబు, కలీం, డీటీడీసీ నర్సింహ, మహేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఎర్రవల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ జిల్లా చైర్మన్ నీలి శ్రీనివాసులు, అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, రుక్మాందర్‌రెడ్డి, రాము, సోమనాద్రి, శ్యామ్, రాజ్‌కుమార్, ఉమాపతి, రాదాబజారి, నర్సిరెడ్డి, వెంకటేష్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

శాంతినగర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అయిజ: మండల కేంద్రంలోని రైతు సంఘం కార్యాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీధర్, మేకల నాగిరెడ్డి, ఈరన్న, బాషా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎర్రవల్లిలో ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు